క్లుప్తంగా

జర్నలిస్టులపై దాడులు హేయం

కాటారం: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని సుద్దాలలో న్యూస్ కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై అధికార పార్టీ నాయకుల దాడి హేయనీయం అని కాటారం సబ్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అధ్యక్షుడు అదప రమేశ్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీరమనేని సంపత్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

గోమాసే శ్రీనివాస్‌పై దాడి సరికాదు

కాటారం: ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గోమాసే శ్రీనివాస్‌పై ప్రేమ్‌సాగర్‌రావు అనుచరులు దాడి చేయడం సరికాదని నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు కొండగొర్ల గట్టయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోమాసే శ్రీనివాస్ దళిత జాతిలో పుట్టి అంబేడ్కర్ ఆలోచన విధానంతో ఎస్సీఎస్టీబీసీ మైనార్టీలను ఏకం చేస్తూ కాంగ్రెస్‌లో చురుకుగా పని చేయడంతో అధిష్టానం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించిందని పేర్కొన్నారు. శ్రీనివాస్‌కు పదవి రావడం ఓర్చుకోలేని అదే పార్టీకి చెందిన ప్రేమ్‌సాగర్ రావు, ఆయన అనుచరులు భౌతికదాడి చేయడం సిగ్గుచేటన్నారు. శ్రీనివాస్ జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధిష్టానం ప్రేమ్‌సాగర్‌రావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన కాటారం నుంచి మహాముత్తారం వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గారెపల్లికి చెందిన పల్నాటి బలరాం అనే వ్యక్తి మహాముత్తారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో నేతకానిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. దీంతో బలరాం తలకు, మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడి కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉచిత వైద్యశిబిరం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆకులవారి గణపురంలో అమ్మ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భరత్‌రెడ్డి, ప్రతిమరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

విరాళం



ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా పంచాయతీ పరిధి రాంపూర్‌లో నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బొమ్మగాని జగదీశ్వర్‌గౌడ్–హైమావతి దంపతులు శనివారం రూ.10,016ల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రాజుగౌడ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రణదీప్, కృష్ణప్రసాద్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

'నల్లెల' లోటు పూడ్చలేనిది



ములుగు: నల్లెల కుమారస్వామి లేనిలోటు కాంగ్రెస్ పార్టీకి పూడ్చలేనిదని ములుగు ఎమ్మెల్యే కుమారుడు సూర్య అన్నారు. నల్లెల మూడవ రోజు కర్మ కార్యక్రమానికి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. అనంతరం నల్లెల జ్ఞాపకార్థం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, మేకల రాజు నిర్మించిన స్మారక గీతం సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొమురం ధనలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఎండీ చాంద్‌పాషా, చెన్నోజు సూర్యనారాయణ, ఆకుతోట చంద్రమౌళి, బండి శ్రీనివాస్, దనవత్ సీతారాంనాయక్, మావురపు తిరుపతిరెడ్డి, కళ్యాణి, కోటి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శైలజ అన్నారు. శనివారం మండలంలోని చింతకుంట రామయ్యపల్లి, కైలాపూర్ శివారు శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించిందారు. అలాగే పిల్లలతో ప్రీ స్కూల్ కార్యక్రమాలను చేయించినట్లు తెలిపారు. గర్భిణులకు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం ఆరు నెలల బాబుకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు కవిత, మంజుల, రజిత తదితరులు ఉన్నారు.



బాబుకు అన్నప్రాసన చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ శైలజ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: రైతులు అందుబాటులో ఉండే మిల్లులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శాంతినగర్ శివారులో అంజనేయ అగ్రో ఇండస్ట్రీస్ జిన్నింగ్ ప్రెస్సింగ్ మిల్లును శనివారం ప్రారంభించి మాట్లాడారు. మారుమూల ప్రాంతాలలో వ్యాపారాన్ని విస్తరించేందుకు ఆకుల రాజయ్య అనే వ్యాపార వేత్త ఈ ప్రాంతంలో నెలకొల్పడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాటన్ మిల్లర్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్, చీఫ్ మేనేజర్ రాజేష్, ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి, చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరెపల్లి మల్లయ్య, రైతులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టా సర్టిఫికెట్ల పంపిణీ



పట్టా సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

కాటారం: జీఓ నంబర్ 58 కింద మంజూరైన పట్టా సర్టిఫికెట్లను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు శనివారం అందజేశారు. గతంలో ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవల అర్హులైన పలువురు లబ్ధిదారులకు మంజూరయ్యాయి. దేగులగూడెంలో ఒకరికి, మద్దులపల్లిలో 8 మంది లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు వచ్చినట్లు తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జాడి మహేశ్వరీ, రాజమణి, ఆర్‌ఐ వెంకన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఖదీర్‌ఖాన్ కుటుంబానికి న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

కాటారం: మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో చేయని నేరానికి పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో మృతి చెందిన ఖదీర్‌ఖాన్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌కు బీఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖదీర్‌ఖాన్ మృతికి కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి మౌలానా, సందానిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

పలిమెల: మండలంలోని పంకెన గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ గండ్ర వెంకటరమణారెడ్డిదే..

టేకుమట్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ గండ్ర వెంకటరమణారెడ్డిదేనని ఆ పార్టీ యూత్ మండల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తున్నారని, అలాంటి అసత్య వార్తలను నాయకులు నమ్మవద్దని సూచించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన కేటీఆర్ సభలో టికెట్‌పై ఒక స్పష్టత వచ్చిందని అందులో ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. పార్టీ కోసం పని చేసే ప్రతీ కార్యకర్తకి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నానవేని కుమార్, మచ్చ శ్రీకాంత్, శాస్త్రాల రాజు, పోశాల రాజు, నరేష్, కూకట్ల దేవేందర్, మాట్ల వెంకటేష్, బండెల శ్రావణ్, కొండ్ర రాజేందర్, ఓనపాకల శశికుమార్, ఒడుగంటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువజన నాయకులు

శాలువాల అందజేత



శాలువాలను అందిస్తున్న ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి

టేకుమట్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి శనివారం శాలువాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాలువాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్



స్థానికులతో చలిమంటలు కాగుతున్న ఎస్సై

మహాముత్తారం: గ్రామస్తులు మావోయిస్టులకు సహకరించొద్దని ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని దండెపల్లి గొత్తికోయల గుంపు వద్ద శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గుంపులో ఎంత మంది నివసిస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎవరైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వ్యక్తులకు సహకరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. అనంతరం గొత్తికోయల గుంపులో చలిమంటలు కాగుతూ వారి వివరాలు తెలుసుకున్నారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్ సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న సతీష్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెడికో విద్యార్థి ప్రీతి కుటుంబ సభ్యులను శనివారం రామన్నగూడెంతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, చేరి ప్రభాకర్‌రెడ్డి, సామంతుల వీరన్న ఉన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని తహసీలార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ పాయం రమణ చేతుల లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం పేద ప్రజలకు వరం అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ యామిని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంబాబు, మండల కార్యదర్శి పిల్లారి మురళి, అధికార ప్రతినిధి దామోదర్, వేణు, లక్ష్మీనారాయణ, శాంతమూర్తి, శ్రీను ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ రమణ

నియామకం

ములుగు రూరల్/ఎస్ఎస్‌తాడ్వాయి: బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా తాడ్వాయి మండలానికి చెందిన ద్యాగల సరేందర్‌ను నియమించినట్లు యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోయిల మహేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నియమక పత్రాన్ని అందించారు. జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్ ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జెడ్పీ చైర్మన్ జగదీశ్‌కు, ఇన్‌చార్జ్ మహేష్‌కు సరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాంనాయక్, మండల యువజన విభాగం అధ్యక్షుడు భైకాని సాగర్, కోట సురేష్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న చిరంజీవి

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదెపు చిరంజీవి అన్నారు. మండలంలోని మేడారం సబ్‌సెంటర్ పరిధిలోని కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 22 మందికి శనివారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి, డీఈఓలు అనిల్, సరస్వతి, రాజ్యలక్ష్మి ఉన్నారు.

రహదారిపై మట్టి కుప్పలు

● ఇబ్బంది పడుతున్న రైతులు



ఎడ్ల బండి వెళ్లకుండా రోడుపై అడ్డంగా పోసిన మట్టి కుప్ప

మల్హర్: పంట పొలాలకు వేళ్లే రహదారిపై ఓ వ్యక్తి మట్టి కుప్పు పోసి తమను ఇబ్బందులకు గురి చేసినట్లు రైతులు శనివారం ఆరోపించారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పలపల్లి మానేరు పరిధిలో పంట పొలాలకు వెళ్లే రోడ్డుపై ఓ వ్యక్తి కావాలనే అడ్డంగా మట్టి కుప్పు పోసినట్లు తెలిపారు. రోడ్డుపై మట్టి పోసి తమ పొలాలకు వాహనాలు, ఎడ్ల బండ్ల ద్వారా ఎరువులు, మందు బస్తాలు తీసుకెళ్లకుండా ఇబ్బందులు గురి చేసినట్లు వాపోయారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకొని మట్టి కుప్పును తొలగించాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించాడని తెలిపారు. గతంలో మానేరులో రోడ్డు ఏర్పాటు చేసి మరి ఈ రహదారి గుండా అక్రమంగా ఇసుక తరలించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మరోమారు ఇసుక అక్రమ రవాణాకు ఇసుకసారులు పొలాల్లోని మట్టి రోడ్డును చదును చేసి, మానేరులో రోడ్డు వేయడానికి సిద్ధమతున్నట్లు సమాచారం.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..



బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నారాయణరెడ్డి, నాయకులు

కాటారం: ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిచ్చి పిచ్చి మాటలు, అసత్య ఆరోపణలు చేయడం మానుకోకపోతే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి హెచ్చరించారు. కాటారం మండల కేంద్రంలోని అతడి నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడారు. కాటారంలో నిర్వహించిన సమావేశంలో బండి సంజయ్ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ సారా తాగుతారని వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ కేసీఆర్ ఇంట్లో ఏమైనా పని చేశాడా అని ఎద్దేవ చేశారు. బీజేపీ ఓ మతతత్వ పార్టీ అని కేసీఆర్ అచ్చమైన ఓ హిందూవాది అని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడగొట్టడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం కాటారం ప్రధాన కూడలిలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ వెంకటేశ్వరరావు, దబ్బెట రాజేశ్, దోలి అర్జయ్య, వేణు, మండల లక్ష్మారెడ్డి, బాలరాజు, రాము, లక్ష్మినారాయణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస దీపికల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: మండలంలోని చల్లగరిగ జిల్లా ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అభ్యాస దీపికలను ఎంఈఓ కోడెపాక రఘుపతి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీటిని రూపొందించడం జరిగిందన్నారు. పాఠ్యంశాల వారిగా భావనలు గుర్తించి వాటికి తగిన వివరణ ఇవ్వడం, ఇచ్చిన అంశాలపై వ్యాఖ్యానించడం, సమాచార పట్టికలు తదితర అంశాలను పొందుపరచినట్లు తెలిపారు. అలాగే అభ్యాస దీపిక పుస్తకాలను త్వరలోనే మండలంలోని ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలేవి?

మంగపేట: మండలంలోని పెరికలకుంట చెరువులో అక్రమంగా జేసీబీతో మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోక పోవడంపై అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు నుంచి కొత్త చీపురుదుబ్బ గ్రామం వరకు నూతనంగ నిర్మిస్తున్న రోడ్డు పనులకు గుత్తేదారు ఎలాంటి అనుమతులు లేకుండా రాజుపేట, బ్రాహ్మణపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి పెరికలకుంట చెరువులో క్వారీ ఏర్పాటు చేసి రోడ్డు పనులకు మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జేసీబీ యజమానితో ఓ ఇద్దరు వీఆర్‌ఏలు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని అక్రమంగా చెరువు నుంచి మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.



చెరువులో అక్రమంగా చేపడుతున్న తవ్వకాలు

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మంగపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుక్కల నాగేందర్, తోటి ఉపాధ్యాయురాలు వివాహేతర సంబంధం పెట్టుకుని ఉపాధ్యాయ వృత్తికి కలంకం తీసుకువచ్చారని వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా కమిటీ చైర్మన్ దీగొండ నర్సింహారావు అధ్యక్షతలో పాఠశాల నిర్వహణపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడన్నారు. అతనే కాకుండా పాఠశాలలో మరో ఉపాధ్యాయుడు సైతం సైకోగా వ్యవహరిస్తు విద్యార్థినిల పట్ల అసభ్య కరంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. దీంతో తమ పిల్లలు పాఠశాలకు రావడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం సైతం సక్రమంగా పెట్టడం లేదని వాపోయారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ కల్పించుకుని పాఠశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మేనక, విద్యార్థుల తల్లిదండ్రులు సయ్యద్ మీరాపాష, చిప్ప లక్ష్మినారాయణ, జవంగుల రవికుమార్, వడ్ల కొండ భిక్షపతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.